సాగు అంతంతే..!

గతేడాదితో పోల్చితే సగానికి తగ్గిన మిర్చి సాగు

- గిట్టుబాటు ధర లేక అప్పులపాలైన రైతులు


సాగు చేసిన మిర్చి

రేగొండ: రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లో మిర్చి పంటకు పెట్టింది పేరు. ప్రధానంగా మిర్చికి అనుకూలమైన సారవంతమైన నల్లరేగడి నేలలతో పాటు ఎర్ర నేలలు ఉండటంతో అనుకున్న దిగుబడి రావడంతో దశాబ్దాల తరబడి మిర్చి పండిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకున్నారు ఇక్కడి రైతులు. కొంత మంది రైతులు తమకున్న రెండు, మూడు ఎకరాల్లో మిర్చి పంటనే సాగు చేస్తున్నారంటే మిర్చిపై ఇక్కడి రైతులకు ఎంత ఆసక్తి ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. కానీ ఈ సంవత్సరం మాత్రం భిన్నంగా మిర్చి సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఉమ్మడి రేగొండ మండలంలో గతేడాది 15 వేల ఎకరాల్లో మిర్చి సాగు చేయగా, ఈ ఏడాది 6 వేల ఎకరాలలో మిర్చి సాగు చేయవచ్చని అంచనా. అంటే మండలంలో మిర్చి సాగు సగానికి పైగా తగ్గిపోవడం గమనార్హం.

నష్టాలు, తెచ్చిన అప్పులు తీరక..

గతేడాది మిర్చి పంటకు అనుకూల వాతావరణం, తెగుళ్ల సోకడంతో దిగుబడి గణనీయంగా తగ్గి మిర్చి రైతులు నష్టపోయారు. వచ్చిన కొద్ది పాటి పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో కొంత మంది రైతులు పంట నిల్వలను కోల్డ్ స్టోరేజిలలో నిల్వ చేయగా, మరికొందరు రైతులు అతి తక్కువ ధరకు అమ్ముకున్నారు. ఎరువులు, పురుగు మందులకు తెచ్చిన అప్పు తీర్చడానికి, కూలీలకు ఇవ్వడానికి విధిలేని పరిస్థితులలో తక్కువ ధరకు పంటను అమ్ముకున్నారు. దీంతో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈ సారి చాలా మంది రైతులు మిర్చి సాగుకు దూరంగా ఉంటున్నారు. మిర్చికి ప్రత్యామ్నాయంగా పత్తి, వరి, ఇతర పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. కొద్ది మంది రైతులు మాత్రమే గతంలో ఐదు ఎకరాలు మిర్చి వేసిన రైతులు ఇప్పుడు ఎకరం నుంచి రెండు ఎకరాలకు పరిమితమవుతున్నారు.

ఎకరంలోనే సాగు చేస్తున్నా..



గత ఎనిమిది సంవత్సరాల నుంచి నాలుగు ఎకరాల్లో మిర్చి పాగు చేశా. గతేడాది కనీస దిగుబడి రాకపోగా, గిట్టుబాటు ధర లేకపోవడంతో రూ.2 లక్షల వరకు అప్పయింది. అప్పు ఎలా తీర్చాలో తెలియడం లేదు. నాకున్న ఎనిమిది ఎకరాల్లో ప్రస్తుతం ఐదు ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాలలో వరి పంట సాగు చేస్తున్నా. ఆశ చంపుకోలేక ఈ ఏడాది ఒక ఎకరంలో మాత్రమే మిర్చి వేయడానికి దుక్కిని సిద్ధం చేశా.

– వన్నాల శివాజీ, రైతు, కొత్తపల్లిగోరి

క్లుప్తంగా

నేడు 'ఉపాధి' జాతర

మల్హర్: మండలంలోని ఆయా గ్రామాల్లో నేడు (శుక్రవారం) నిర్వహించే ఉపాధిహామీ పనుల జాతరను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్, ఉపాధిహామీ ఏపీఓ గిరి హరీశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధిహామీ పనుల జాతరలో పలు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

మొగుళ్లపల్లి/టేకుమట్ల: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా 2005–26 సంవత్సరానికి గాను 50శాతం సబ్సిడీపై రాష్ట్ర ప్రభుత్వం పలు రకాల పనిముట్లు అందజేస్తుందని మొగుళ్లపల్లి, టేకుమట్ల ఏఓలు సురేందర్‌రెడ్డి, కల్యాణి గురువారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, జనరల్ మహిళా, చిన్నకారు, సన్నకారు మహిళా రైతులకు అవకాశం ఉందని సెప్టెంబర్ 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, కుల ధ్రువీకరణ పత్రం, ట్రాక్టర్‌కు సంబంధించిన పరికారాలైతే ఆర్‌సీని ఏఈఓలకు అందజేయాలన్నారు. ఈ పథకం ద్వారా బ్యాటరీ స్ప్రేయర్స్, పవర్ స్ప్రేయర్స్, రోటవేటర్స్, కల్టివేటర్స్, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్, స్ట్రా బేలర్ కేటాయించినట్లు తెలిపారు.

సన్మానం

కాటారం: నేతకాని మహార్ విద్యార్థి విభాగం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియామకమైన మండలంలోని చిద్నెపల్లికి చెందిన బీరెల్లి రజనీకుమార్‌ను గురువారం ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల సమ్మయ్య సన్మానించారు. మండలానికి చెందిన రజనీకుమార్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా నియామకం అవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఆత్మకూరి కుమార్‌యాదవ్, మహేశ్, రాజశేఖర్, టిల్లు పాల్గొన్నారు.

ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న హరీశ్‌రెడ్డి

భూపాలపల్లి అర్బన్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన పండ్ల వ్యాపారి తాటకొండ సమ్మక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని భూపాలపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీశ్‌రెడ్డి గురువారం పరామర్శించారు. కాలనీవాసులతో కలిసి వారి కుటుంబ సభ్యులకు రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 22వ వార్డ్ బీఆర్‌ఎస్ నాయకులు రవి, మూర్తి, థామస్, పోశయ్య, శేఖర్, చిరంజీవి పాల్గొన్నారు.

బియ్యం అందజేత

చిట్యాల: మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన పర్లపెల్లి భద్రమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేశ్ గౌడ్ పరామర్శించి 50కిలోల బియ్యం అందజేశారు. మండల ప్రధాన కార్యదర్శి మైదం శ్రీకాంత్, నాయకులు పంచిక మహేష్, వల్లాల ప్రవీణ్, గజనాల రవీందర్, చింతల రాజేందర్, కేంసారపు ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

హక్కుల సాధనకు పోరాటం


మాట్లాడుతున్న సంతోశ్

భూపాలపల్లి రూరల్: జర్నలిస్టుల హక్కుల సాధనకు తెలంగాణ స్టేట్ జర్నలిస్టు యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సంతోశ్, ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాకతీయ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో జర్నలిస్టుల పక్షాన టీఎస్‌జేయూ పోరాడుతుందని స్పష్టం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు గట్టు రవీందర్ గౌడ్, ప్రచార కార్యదర్శి కారుకూరి సతీశ్, సంయుక్త కార్యదర్శి కడపక రవి, బోళ్లపల్లి జగన్ గౌడ్, చంద్రమౌళి, దేవేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 282 రద్దు చేయాలి


మాట్లాడుతున్న పార్వతి

మల్హర్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 282ను వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కార్యదర్శి దుబాసి పార్వతి డిమాండ్ చేశారు. మండలంలోని కొయ్యూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ జీ ఓతో వ్యాపార సముదాయాల్లో పనివేళలను 8 గంటల నుంచి 10 గంటల వరకు పెరగుతుందని చెప్పారు. ఈ జీఓ అమలైతే కార్మికులు తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతారని తెలిపారు. కార్మికులు ఐక్యంగా జీఓ రద్దు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించొద్దు


మాట్లాడుతున్న డీఎస్పీ సూర్యనారాయణ

- డీఎస్పీ సూర్యనారాయణ

కాళేశ్వరం: గుడుంబా, గంజాయి, గుట్కాలను విక్రయించొద్దని కాటారం డీఎస్పీ సూర్యనారాయణ అన్నారు. మహదేవపూర్ మండలం సూరారం గ్రామంలో గురువారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పవన్‌కుమార్‌లతో కలిసి సందర్శించారు. గ్రామంలో 15 నంబర్ ప్లేటు లేని వాహనాలను గుర్తించి వాటికి జరిమానా విధించారు. అనంతరం గ్రామంలో సెంటర్ వద్ద గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. యువత బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. కాగా, పది లీటర్ల గుడుంబాను పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమేష్, తమాషారెడ్డిలు, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మెరుగైన విద్యాబోధన చేయాలి

- ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల


ప్రశంస పత్రాలు అందజేస్తున్న తిరుమల

కాటారం: ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలు మెరుగుపర్చుకొని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమలసమ్మయ్య అన్నారు. కాటారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్‌ఎం) మేళా నిర్వహించారు. ఈ మేళలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొని తమ సృజనాత్మకతను, బోధనా సామర్థ్యాలను ప్రదర్శించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల, ఎంఈఓ శ్రీదేవి ఉపాధ్యాయుల ప్రదర్శనలను తిలకించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండేలా తీర్చిదిద్దాలని సూచించారు. విద్యా ప్రమాణాలు పెంపొందించడంలో ఇలాంటి మేళాలు ఎంతో కీలకం అని పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ విభాగాల్లో పలు పాఠశాలల ఉపాధ్యాయుల ప్రదర్శనలు ఎంపిక చేసి ప్రశంస పత్రాలు అందజేశారు. ఆర్‌పీలు నరివెద్ది సత్యనారాయణ, సురేశ్, మోహన్, పరమేశ్, వేణుగోపాల్, శ్రీకాంత్, రఘునందన్, హెచ్‌ఎంలు రమేశ్, భగవాన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ


సరుకులు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం చంద్రుపల్లి, నాగపల్లి గ్రామాల్లోని నిరుపేదల పరిస్థితిని ఖమ్మంకు చెందిన అన్నపూర్ణ సేవా సమితికి మండలానికి చెందిన కళాకారులు బల్లి సురేందర్, యువ చైతన్య యూత్ అధ్యక్షుడు కొండగొర్ల సంతోష్ తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించి ఆ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం 65 నిరుపేదలకు మందికి ట్రస్ట్ చైర్మన్ బాణాల లత ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు జి.హరీశ్ కుమార్, ధనలక్ష్మి, ఉమ, రమేశ్ గ్రామస్తులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముంజం సమ్మన్న, సమ్మన్న, రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్ వైర్ చోరీ


ధ్వంసం చేసి పడేసిన ట్రాన్స్‌ఫార్మర్

పలిమెల: మండలంలోని పంకెన గ్రామ శివారు తీగల వాగు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైర్, ఆయిల్‌ను దొంగలించిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకున్నట్లు ఏఈ మంగిలాల్ తెలిపారు. ఏఈ తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులోని మెయిన్ రోడ్డు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మన్‌ను ధ్వంసం చేసి దానిలోని కాపర్‌వైర్ ఎత్తుకెళ్లారు. టాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసిన స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఈ ఘటనపై పలిమెల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్ పెట్టే విధంగా చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు.

లారీ డ్రైవర్ల ఆందోళన


ప్రధాన రహదారి పై నిలిచిన లారీలు

గణపురం: సరైన రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెల్పూరు కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రానికి బొగ్గును తరలించే లారీలు జాతీయ రహదారి వెంట నిలిపి డ్రైవర్లు గురువారం ఆందోళనకు దిగారు. సుమారు 10 గంటల పాటు లారీలను నిలిపివేయడంతో భూపాలపల్లి–హనుమకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దఎత్తున ట్రాఫిక్ జామ్ అయింది. కేటీపీపీ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని లారీ డ్రైవర్లు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లోకి లారీలు వెళ్లిన సమయంలో అన్‌లోడ్ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం కమిటీ ఎన్నిక


కలెక్టర్‌కు నూతన కమిటీ పత్రం అందజేస్తున్న ఉద్యోగులు

భూపాలపల్లి: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం జిల్లా కమిటీని ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గద్దం జ్ఞానేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్ సమావేశపు మందిరంలో గురువారం సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా బండారి శంకరయ్య, సహాఅధ్యక్షుడిగా అల్లెన్ విజయ్, ప్రధాన కార్యదర్శిగా గోపిరెడ్డి విజయ్‌కుమార్, కోశాధికారిగా పవన్‌సాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు దాస్య నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ పాల్గొన్నారు. ఎన్నిక అనంతరం నూతన కార్యవర్గం పత్రాన్ని కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్‌లకు అందజేశారు.

గణేశ్ ఉత్సవ కమిటీ..


ఎన్నికైన కమిటీ సభ్యులు

చిట్యాల: మండల కేంద్రంలోని గణేశ్ వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గణపతి నవరాత్రి ఉత్సవాల నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వల్లాల ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా క్యాతరాజు మల్లేశ్, మేడిపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మైదం శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా ఉయ్యాల రమేశ్, కోశాధికారిగా చిలగాని నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా ఒదేల శ్రీహరి, ఈగ కోటి, అక్బర్, తిరుపతి, దశరథం, ప్రవీల, రాజు, వలి, సంతోష్ తదితరులను ఎన్నుకున్నారు.

నియామకం

కాళేశ్వరం: మండల కేంద్రంలో ఐదు మండలాల బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, చల్ల నారాయణరెడ్డి హాజరయ్యారు. మహదేవపూర్ మండల బీజేపీ కార్యవర్గాన్ని నియమించారు. మండల అధ్యక్షుడిగా రాంశెట్టి మనోజ్ కుమార్, ఉపాధ్యక్షులుగా అంకరి రాజేందర్, సూరం మహేశ్, శనిగరం కిష్టయ్య, ఆకుల మధుకర్, ప్రధాన కార్యదర్శులుగా గుజ్జుల శంకర్, బొల్లం కిషన్,లింగంపల్లి వంశీ, బల్ల శ్రావణ్ కుమార్, కార్యదర్శులుగా బంధుగుల సంతోష్, గోరె శ్రీకాంత్, ఎంఆర్ యాదవ్, శ్యామల ప్రశాంత్, కోశాధికారిగా ఉదారి పూర్ణచందర్‌ను ఎన్నుకున్నారు. అలాగే కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడిగా ఓడేటి బాలిరెడ్డి, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా సాగర్ల రవీందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా బూడే శేఖర్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా దుగ్యాల రాములను నియమించారు.

మహాగర్జనను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న శ్యాంబాబు

భూపాలపల్లి రూరల్: సెప్టెంబర్ 9న నిర్వహించే ఛలో హైదరాబాద్ పెన్షన్ల మహాగర్జనను విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్ మడిపల్లి శ్యాంబాబు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంట్రాక్ట్ అసోసియేషన్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ సీనియర్ నాయకుడు అంబాల చంద్రమౌళి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో శ్యాంబాబు మాట్లాడారు. మహాగర్జనకు జిల్లా నుంచి భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు కృషి

- ఏఈఈ ఉపేందర్


అవగాహన కల్పిస్తున్న ఏఈఈ ఉపేందర్

కాటారం: విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాటారం విద్యుత్‌శాఖ ఏఈఈ ఉపేందర్ అన్నారు. విద్యుత్ భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్, దేవరాంపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు అధికంగా నెలకొనే అవకాశం ఉంటుందని విద్యార్థులు, తమతో పాటు తమ తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఏదైన విద్యుత్ ప్రమాదం సంభవించిన, విద్యుత్ తీగలు తెగిపడిన, షార్ట్ సర్క్యూట్ అయిన వెంటనే విద్యుత్ శాఖ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. రైతులు తమ పంట పొలాల వద్ద విద్యుత్ మోటార్లు, విద్యుత్ తీగలపై జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ట్రాన్స్‌కో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐతో యువతకు ఉపాధి అవకాశాలు

- ఐటీఐ వరంగల్ ఆర్‌డీడీ సీతారాములు


అవగాహన కల్పిస్తున్న సీతారాములు

కాటారం: ఐటీఐ, ఏటీసీ కోర్సులు అభ్యసించడం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఐటీఐ వరంగల్ రిజినల్ డిప్యూటీ డైరెక్టర్ బి.సీతారాములు అన్నారు. మండల కేంద్రంలో కాటారం, పెద్దపల్లి, భూపాలపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్స్, ప్రచారం బృందం, సిబ్బందితో కలిసి గురువారం ఆర్‌డీడీ ఐటీఐ విద్యపై అవగాహన కల్పించారు. ప్రధాన కూడలితో పాటు పీఏసీఎస్, బస్టాండ్, ఇతర ప్రాంతాల్లో ప్రజలు, యువతకు ఐటీఐ, ఏటీసీ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న కోర్సులు, కాలవ్యవధి, వాటి వల్ల కలిగే ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు తదితర అంశాల గూర్చి వివరించారు. ఏటీసీ కోర్సుల ద్వారా స్వయం ఉపాధితో పాటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు వెంటనే లభిస్తాయని పేర్కొన్నారు. కాటారంలో ఐటీఐ, ఏటీసీ అందుబాటులో ఉన్నందున్న అర్హులైన విద్యార్థులు, యువత దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డీడీ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ వెంకట్‌రెడ్డి, జుమ్లానాయక్, తిరుపతి, సిబ్బంది శ్రీనివాస్, మహేందర్, ప్రకాశ్, ప్రశాంత్, అభినవ్, సత్యనారాయణ, మధు, సందీప్‌కుమార్, సాయికిరణ్, సతీశ్, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ గోదాం తనిఖీ


గోదాంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల పీఏసీఎస్ గోదాంను మండల వ్యవసాయ అధికారి శ్రీజ, కొయ్యూరు ఎస్సై–2 రజన్‌కుమార్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. గోదాంలో యూరియా సరఫరాపై ఆరా తీశారు. స్టాక్ రికార్డులను పరిశీలించి, ఇప్పటి వరకు ఎంత మేరకు రైతులకు యూరియా అందించారో సొసైటీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు యూరియా సరఫరా చేయాలని ఆదేశించారు. యూరియా అక్రమ రవాణా జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. రైతుల ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ బుక్కును పరిశీలించి ఎరువులు ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ పృథ్వీరాజ్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- తహసీల్దార్ విజయలక్ష్మి


మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

టేకుమట్ల: ఇసుక ట్రాక్టర్ల యాజమానులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తహసీల్దార్ విజయలక్ష్మి కోరారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక ట్రాక్టర్ల యజమానులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల ట్రాక్టర్లు తప్పని సరిగా నంబర్ ప్లేట్లు కలిగి ఉండాలన్నారు. ఇసుకను తరలించే వారు తహసీల్దార్ నుంచి జారీ చేయబడిన అనుమతి పత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లు ట్రాక్టర్లు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ ఉన్నారు.

సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు సెప్టెంబర్1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో చేపట్టే మహాధర్నా వాల్ పోస్టర్‌ను మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షకార్యదర్శులు బండి శ్రీనివాస్, సూదం సాంబమూర్తి, ఉపాధ్యాయులు రామనారాయణ, సుజాత, రాజమౌళి, సదయ్య, నీలిమా రెడ్డి, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

ములుగు రూరల్: బంజారుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని దేవగిరిపట్నం, పత్తిపల్లి గ్రామాలలో నిర్వహించిన తీజ్ వేడుకలకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కల్యాణితో కలిసి హాజరయ్యారు. తొలుత దేవగిరిపట్నంలోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ఏర్పాటు చేసిన తీజ్ వేడుకల్లో తీజ్ బుట్టలను నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజార యువతులు తొమ్మిది రోజులు నిష్టతో ఉండి తీజ్ వేడుకల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నాగమణి, దేవ్‌సింగ్, అభినయ్‌చారి, సారయ్య, భద్రు, బాల బ్రహ్మాచారి, కిషన్ మహరాజ్, నిరంజన్, రాధిక, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

భూపాలపల్లి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు భోజన విరామ సమయంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జయ మాట్లాడారు. ప్రీ ప్రైమరీ విద్యతో పాటు పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరా రు..ఈ కార్యక్రమంలో నాయకులు గుర్రం దేవేందర్, సత్య, పద్మ, నిర్మల పాల్గొన్నారు.